క్లుప్తంగా

కార్మికుల సమస్యను పరిష్కరించాలి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమ జీవితాలను యాజమాన్యానికి ధారపోశారని.. అయినా యాజమాన్యం కార్మికుల సమస్యను పరిష్కరించడం లేదని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ.. కార్మికులు 236 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నా ప్రభుత్వంలో గానీ, యాజమాన్యంలో గానీ మార్పు రాకపోవడం విచారకరమని అన్నారు. మంత్రి నారా లోకేష్ కార్మికుల సమస్యపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు ఇంమాంబీ, బత్తుల భూలక్ష్మి, నవనీతం, అంకయ్య, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థన ద్వారా దేవుని ఆశీస్సులు



ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ నిత్యం ప్రార్థన చేయడం ద్వారా భగవంతుడి కృపకు పాత్రులవుతారని విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో ఆదివారం ప్రత్యేక దివ్యపూజాబలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాతిమా మర్రెడ్డి వాక్యోపదేశం చేస్తూ దేవుని ఆశీస్సులు పొందాలంటే రోజూ ఆయన ప్రార్థన చేయాలని తెలిపారు. దాని ద్వారా సహాయం లభిస్తుందని చెప్పారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. కార్యక్రమంలో మఠకన్యాస్త్రీలు, గుడిపెద్దలు, కథోళిక క్రైస్తవులు పాల్గొన్నారు.

నలుగురు జూదరులు అరెస్ట్

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని యర్రబాలెం శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న నలుగురిని మంగళగిరి రూరల్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ మాట్లాడుతూ.. యర్రపాలెంలో జూదం ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి చేశామని అన్నారు. ఈ దాడిలో నలుగురు జూదరులు.. వారి నుంచి రూ.14,590 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వేగంగా పాతాళ కాళీ ఆలయ నిర్మాణ పనులు



ఫిరంగిపురం: మండల పరిధి వేమవరం గ్రామంలోని కోటి లింగాల క్షేత్రంలో 40 అడుగుల లోతున పాతాళ కాళీ ఆలయ నిర్మాణ పనులు వేగంగా నిర్వహిస్తున్నారు. విగ్రహ ప్రతిష్ట నిర్వహించే పీఠం కిందనున్న ప్రదేశంలో భక్తుల స్వహస్తాలతో రాగి నాణెములు వేసే విధంగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసినట్లు కోటిలింగాల ఆలయ నిర్వాహకులు లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. అమ్మవారి టబుల్ ట్రస్ట్ చైర్మన్ జ్ఞానప్రసన్న బాబా ఆధ్వర్యంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఆయన అన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 10వ తేదీవరకు భక్తులు రాగి నాణెములు వేసే విధంగా ఏర్పాటు చేశామన్నారు. రాగి నాణెములు ఆలయ కమిటీ నిర్వాహకులు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

అలరించిన మహమ్మద్ రఫీ మ్యూజికల్ నైట్



తెనాలిటౌన్: స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన మహమ్మద్ రఫీ మ్యూజికల్ నైట్ ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. సంకీర్తన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న మహమ్మద్ రఫీ మ్యూజికల్ నైట్ ఆదివారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమైంది. రఫీ పాడిన గీతాలను హైదరాబాద్ నుంచి వచ్చిన షానవాజ్, పొన్నూరుకు చెందిన అలీఖాన్, తెనాలికి చెందిన షేక్ సైదా, డాక్టర్ పురుషోత్తమరావులు ఆలపించారు. కళాక్షేత్రం మహమ్మద్ రఫీ అభిమానులతో కిక్కిరిసిపోయింది. డాక్టర్ పురుషోత్తమరావు రఫీ గురించి చెప్పిన మాటలు, పాటల వివరణ ప్రేక్షకులను ఆకర్షించాయి. కార్యక్రమంలో సంకీర్తన కార్యదర్శి కె.రాజేశ్వరరావు, యుగళగీతాల గాయకులు శివలీల, మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రజలకు వివరించాలి

- ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా పూర్తిగా అమలు చేయలేదు
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



నులకపేట 13వ వార్డు కార్యక్రమంలో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లి రూరల్: అమలు కాని హామీలను ఇచ్చిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలను ఏ విధంగా మోసం చేశారో ఇంటింటికీ వెళ్లి వివరిద్దామని వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట 13వ వార్డులో ఆదివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి తాడేపల్లి పట్టణ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. ముందుగా వార్డు పరిధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలపై క్యూఆర్ కోడ్‌ను ప్రజల సెల్‌ఫోన్‌లో స్కాన్ చేయించి పథకాలపై ప్రభుత్వం ఇచ్చిన దొంగ హామీలను వివరించారు. ఎవరికీ ఏ పథకం రావడం లేదని.. పెన్షన్ మాత్రమే అందజేస్తున్నారని ప్రజలు తెలియజేశారు. అనంతరం జరిగిన సభలో దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు రాష్ట్ర ప్రజలకు చేసిన వాగ్దానాలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. చంద్రబాబు మోసాలు, ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తే వారిపై పలుచోట్ల అక్రమ కేసులు పెట్టి దాడులు చేసి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతున్నారని వేమారెడ్డి విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గత ప్రభుత్వం పేదలకు అందించిన సంక్షేమాన్ని గుర్తుచేశారు.

మోసం చేయడం బాబు నైజం..

చంద్రబాబు, వారి తోక పార్టీలు గద్దెనెక్కి ఏడాది అయినా ఒక్క సంక్షేమ పథకం కూడా పూర్తిగా అమలు చేయలేకపోయారని వేమారెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటే పోరాట మార్గాన్ని ఎంచుకుని ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం అని అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు చంద్రబాబు శఠగోపురం పెట్టి కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చే విధంగా పరిపాలన చేస్తారని వేమారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ గోరేబాబు, పట్టణ ఉపాధ్యక్షులు వేల్పు ఎలీషా, ప్రధాన కార్యదర్శులు చిన్నబోతుల దుర్గారావు, చిట్టిమళ్ల స్నేహ సంధ్య, పట్టణ మహిళా అధ్యక్షురాలు దర్శి విజయశ్రీ, మంగళగిరి నియోజకవర్గ రైట్ ఇన్ఫర్మేషన్ అధ్యక్షులు ఉంద్రు కల్యాణ్, తాడేపల్లి పట్టణ సోషల్ మీడియా అధ్యక్షులు వికాస్, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కేఎల్‌యూ నూతన విద్యార్థుల సమ్మేళనం



వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ

తాడేపల్లి రూరల్: ఇంజినీరింగ్ అనేది ఒక మహాద్భుతమని.. ఎన్నెన్నో ఆవిష్కరణల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని కేఎల్‌యూ వీసీ డాక్టర్ పార్థసారధి వర్మ అన్నారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కోర్స్ తీసుకున్న విద్యార్థుల సమ్మేళన అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి వర్మ గత మూడు దశాబ్దాలుగా ఇంజినీరింగ్ రంగంలో గణనీయంగా వచ్చిన ప్రగతిని గురించి వివరించారు. ఇంజినీరింగ్ కోర్సులు, వాటిలో ప్రత్యేకతలు, విద్యార్థులు ఎలా ప్రణాళికా బద్ధంగా నేర్చుకోవాలి.. నైపుణ్యాలు ఎలా సాధించాలో తెలియజేశారు. యూనివర్సిటీలో నిర్వహించే జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరించారు. తల్లిదండ్రుల ఆశయాల సాధనతో పాటు క్రమశిక్షణ, నైపుణ్యం చాలా అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు, డీన్స్ డాక్టర్ శ్రీనాధ్, కృష్ణారెడ్డి, కేఆర్ఎస్ ప్రసాద్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలనలో కూటమి విఫలం



కార్యక్రమంలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చి హామీలను అమలు చేయడంలో విఫలమయ్యిందని వైఎస్సార్‌సీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్ అన్నారు. ఆదివారం మంగళగిరి పట్టణ పరిధిలోని ఇస్లాంపేట 13వ వార్డులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడారు. వార్డులో పలువురు తమకు పథకాలు ఏమీ రాలేదని చెప్పగా.. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ఏ ఒక్కరూ కూడా నాయకులను కలువకుండా పథకాలు పొందారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి న్యాయం జరిగిందని తెలిపారు. అనంతరం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు సంకే సునీత, పట్టణ ఉపాధ్యక్షులు షేక్ మహబూబ్, మాజీ కౌన్సిలర్ షేక్ బేబి, మైనార్టీ నాయకులు ఎండీ ఫిరోజ్, విద్యార్థి విభాగం అధ్యక్షులు కర్రి ప్రదీప్, క్రిస్టియన్ మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షులు విక్టర్ ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థిక సహాయం అందజేత



కార్మికుడికి సహాయం అందజేస్తున్న నాయకులు



విద్యార్థులకు సహాయాన్ని అందజేస్తున్న శివప్రసాద్

తాడేపల్లి రూరల్: నవులూరుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడికి ఆదివారం టీడీపీ నాయకులు, శ్రీ వెంకట త్రివేణి గ్రూప్ ఆఫ్ కంపెనీల అధినేత బత్తుల శ్రీనివాసరావు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవులూరుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు కామిని మంగరావు పక్షవాతంతో బాధపడుతూ ఇంటి వద్దనే చికిత్స పొందుతున్నారని, అతని వైద్య నిమిత్తం తమ కంపెనీలో కార్మికులు, తాము కలిపి రూ.31 వేలు ఆర్థిక సహాయాన్ని అదజేశామని తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ మేస్త్రీలు కృష్ణ, అయ్యప్ప, కొండమ్మ, చామంతి, చిట్టెమ్మ, చిరంజీవి, ఉమామహేశ్వరరావు, విష్ణు, సురేంద్ర, భువన తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సహాయం..

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని రామ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఆదివారం వడ్లమూడి గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని తాడేపల్లిలోని వారి కార్యాలయంలో అందజేశారు. ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర, గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్, ఏపీ హౌసింగ్ ఎండీ ఎం.శివప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ పలగాని శ్రీనివాస్, దాత రాజులపాటి పోతురాజులు మాట్లాడుతూ.. చదువులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వడ్లమూడి గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులకు చెరో రూ.10 వేలు చొప్పున సహాయాన్ని అందజేశామని వారు తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



దుగ్గిరాల: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారు రచించిన 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలు, భగవద్గీత ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడు గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శ్రీ కృష్ణుడు, భగవద్గీతలను విశ్వసించడం వల్ల జ్ఞానం, మోక్షం లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో టి.వి.కృష్ణారావు, ఆర్.రామకృష్ణ, షేక్.దిల్షా, బి.శివలింగం నాయక్, పట్టాబి శ్రీను, ఫణిదరం శివ, బ్రహ్మం, జె.హరిబాబు, శివ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

కలాం జీవితం అందరికీ ఆదర్శనీయం



దుగ్గిరాల: దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం విగ్రహానికి పాఠశాల హెచ్.ఎం ఎస్.శోభాదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. కలాం విద్యార్థుల పట్ల విపరీతమైన ప్రేమ కనబరిచేవారని తెలిపారు. విద్యార్థులు కలలు కనండి.. వాటిని నేరవేర్చుకోండి అని కలాం సందేశం ఇచ్చారని, కలాం జీవితం విద్యార్థులకు ఆదర్శనీయం అని అన్నారు. కలాం వర్ధంతిని ఆదివారం దుగ్గిరాల జెండా చెట్టు సెంటర్ వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సీనియర్ నాయకులు షేక్.సుభాని, మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన అంచలంచలుగా ఎదిగి ఉన్నత శిఖరాలు అధిరోహించారని తెలిపారు.

అన్న క్యాంటీన్‌కు భూమి పూజ

దుగ్గిరాల: పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు యార్డు చైర్మన్ ఉన్నం ఝాన్సీరాణి తెలిపారు. ఆదివారం రైలుపేటలో నూతన క్యాంటీన్‌కు భూమి పూజ నిర్వహించి ఆమె మాట్లాడారు. శాశ్వత భవన నిర్మాణం త్వరగా నిర్మితమైతే.. పసుపు యార్డుకు దూర ప్రాంతాల నుంచి వస్తున్న వారికి క్యాంటీన్ ఉపయోగపడుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో కె.శ్రీఅనిత, జి.వెంకట్రావు, నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ రాధిక, ఇన్‌ఛార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని వెస్ట్‌బెర్రీ స్కూల్ ఆధ్వర్యంలో కళాక్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన 2కే వాక్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలుష్యం వలన పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు. ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన అనేక అనార్థలు ఉన్నాయన్నారు. తక్కువ మందం కలిగిన వస్తువులు, కవర్లు భూమిలో కలిసిపోకుండా కాలుష్యాన్ని పెంచుతాయని చెప్పారు. అందరూ ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించడం మానివేయాలన్నారు. వాటి స్థానంలో క్లాత్, జానపనారా సంచులను వాడాలని సూచించారు. వెస్ట్‌బెర్రి స్కూల్ ప్రిన్సిపాల్ టి.వి.సుబ్రమణ్యం మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం వలన మనిషి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కాలుష్యం కారణంగా అనేక వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. వాతావరణాన్ని కలుషితం కాకుండా చూడగలిగితే బావితరాలకు భవిష్యత్‌ను అందించేవారమవుతమన్నారు. ఆ దిశగా అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువలపై ఆక్రమణలు తొలగించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



పూడికతీత పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, వైస్‌చైర్మన్ మాలేపాటి

తెనాలిఅర్బన్: కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. 7వ వార్డులో ఆదివారం ఆమె పర్యటించారు. అక్కడ జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వలపై నాపరాళ్లు, ఇతర వస్తువులు ఏర్పాటు చేయడాని గమనించిన ఆమె వాటిని తొలగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు కాలువలు బాగు చేయడానికి వాటిపైన వేసిన ఫ్లోరింగ్ ఇబ్బందికరంగా మారాయని తెలిపారు. దీని వల్ల కాలువలు పూర్తిస్థాయిలో బాగు చేయలేకపోతున్నట్లు చెప్పారు. ఎవరు మురుగు కాలువలపై ఎటువంటి వస్తువులను పెట్టవద్దని సూచించారు. వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి మార్గాలు తెలుస్తాయి



విద్యార్థికి జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ కె.శరత్‌కుమార్, వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: మోడల్ యునైటెడ్ నేషన్స్ సదస్సు నిర్వహణ వల్ల భావితరాల వారికి ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలు.. వాటి పరిష్కార మార్గాలు తెలుస్తాయని డాక్టర్ కె.శరత్‌కుమార్ అన్నారు. మండలంలోని నంబూరు వివా స్కూల్ ఆధ్వర్యంలో జరుగుతున్న మూడో రోజు అంతర్జాతీయ వ్యవహారాలపై అవగాహన, నాయకత్వ నైపుణ్యాలు అభివృద్ధి మోడల్ యునైటెడ్ నేషన్ (ఐక్యరాజ్య సమితి నమూనా) కార్యక్రమం ఆదివారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ కె.శరత్‌కుమార్, వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ హాజరయ్యారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ సదస్సులో తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ జాతీయ, అంతర్జాతీయ పాఠశాలల నుంచి 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఐక్యరాజ్య సమితిలో భాగమైన ప్రతినిధుల సభ, భద్రత మండలి, సచివాలయం, అంతర్జాతీయ న్యాయస్థానం, ఆర్థిక సాంఘిక మండలి సభ్యులుగా ఏర్పడి ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లు, మానవ హక్కులు, భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన అంశాలపై చర్చించారు. చర్చలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.శరత్‌కుమార్ మాట్లాడుతూ.. భారతదేశం శాస్త్ర, సాంకేతిక, ఆర్థిక, పరిశోధనారంగాలలో వేగంగా అభివృద్ధి చెందుతూ, ఐక్యరాజ్య సమితిలో కీలక భూమిక పోషించే స్థాయికి ఎదుగుతుందన్న ఆశాభావం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులను అభినందించారు. వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమిష్టి కృషి ద్వారా అద్భుతాలు సృష్టించగలుగుతారన్న విషయాన్ని ఈ కార్యక్రమం ద్వారా నిరూపించారన్నారు. యమ్‌యూఎన్ సంధానకర్తలైన విద్యార్థి బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎలె కమాండర్ కేపీఎస్ రావు, ప్రిన్సిపాల్ సీహెచ్ సరళ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



దుగ్గిరాల: వైద్య శిబిరంలో ఉచితంగా మందు ఇవ్వడం అభినందనీయమని తహసీల్దార్ ఐ.సునీత అన్నారు. ఆదివారం పెదకొండూరు గ్రామంలో శ్రీ కనకపుట్లమ్మ తల్లి దేవస్థానంలోని ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. వైద్య పరీక్షలు నిర్వహించి ప్రతి ఒక్కరికీ ఉచితంగా మందులు ఇవ్వడంపై మానవ సేవా సంస్థ నిర్వాహకులను ప్రశంసించారు. మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్ కుమార్ మాట్లాడుతూ.. తమ సంస్థ రెండు తెలుగు రాష్ట్రాలలో ఎన్నో వైద్య శిబిరాలు నిర్వహించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో దుగ్గిరాల ట్రైనింగ్ ఎస్సై హరికృష్ణ, డాక్టర్లు, కె.హరీష్, కె.మిథునేశ్వర్ రెడ్డి, వంశీ కృష్ణ, శ్రావణి, జి.శశికర్, అర్చన మాధురి, శ్రీకర్, సంస్థ నిర్వాహకులు టి.వెంకట శివప్రసాద్, డి.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

తెనాలిటౌన్: రాబోయే రోజుల్లో భారత కమ్యూనిస్ట్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని నరేంద్రమోదీ అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహిస్తున్న 26వ నియోజకవర్గ పట్టణ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభకు పట్టణ కార్యదర్శి ఎం. కిరణ్‌బాబు అధ్యక్షత వహించారు. ఎర్రజెండాను ఆవిష్కరించి అమరవీరులకు జోహర్లు అర్పించారు. నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, అన్నం వెంకటస్వామి, బొల్లిముంత కృష్ణ, పరుచూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి, జ్ఞాన మార్గాలను అనుసరించాలి



తెనాలిటౌన్: ప్రతి ఒక్కరూ భక్తి, జ్ఞాన మార్గాలను ఆచరించాలని ప్రముఖ విద్వాంసులు దావులూరి శ్రీరామమూర్తి ప్రవచించారు. స్థానిక గాంధీనగర్, కవిరాజాపార్కులోని వీజీకే భవనంలో ఆదివారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జూలై నెల సమావేశం నిర్వహించారు. సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ విద్వాంసులు దావులూరి శ్రీరామమూర్తి పాల్గొని ఈశ్వరతత్వంపై ప్రవచించారు. మానవుని విలువలు పెంపొందాలంటే భక్తి,జ్ఞాన మార్గాలను పాటించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి టి.పూర్ణచంద్రరావు, కోశాధికారి ఎస్.ఆదినారాయణ, ఉపాధ్యక్షులు శ్రీరామమూర్తి, కేవీ కోటయ్య, చలమయ్య, కె.రామకృష్ణరావు, సిహెచ్.శివరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంచాల గ్రామ దేవతకు విశేష పూజలు



చేబ్రోలు మండలం మంచాల గ్రామంలోని గ్రామ దేవత దేశమాంబ అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించారు. శ్రావణమాసం ఉత్సవాల్లో భాగంగా మొదటి ఆదివారం అమ్మవారికి అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారికి వివిధ అభిషేకాలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. దేశమాంబ అమ్మవారు కనులపండువుగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో శోభయమానంగా తీర్చిదిద్దారు. - చేబ్రోలు

పాతూరి సుబ్రహ్మణ్య కవికి ఘనసత్కారం



తెనాలిటౌన్: నటరాజ పాతూరి నాటక సాహితీ కళా సమితి తెనాలి వ్యవస్థాపకులు డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్య కవిని వారణాసి తెలుగు సంగమం సభలలో ఘనంగా సత్కరించారు. వద్దిపర్తి పద్మాకర్ 25వ శతావధానంలో సుబ్రహ్మణ్య కవి మూడురోజులు ప్రాశ్నికులుగా తెలుగు భాషా సేవ చేసినందుకు ఈ ఘన సత్కారం లభించింది. శృంగేరి జగద్గురువుల దివ్యానుగ్రహంతో వజ్రోత్సవ భారతి మహోత్సవాల సందర్భంగా త్రిభాషా సహస్ర అవధాని వద్దిపర్తి పద్మాకర్ ఈ నెల 25 నుంచి 27 వరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో శృంగేరి శంకరమఠం వేదికగా మూడు రోజుల పాటు శతవధానంలో నిషిద్ధాక్షరి సమస్య వర్ణన అంశాల్లో పాతూరి కవి ప్రాశ్నికునిగా వ్యవహరించారు. తెలుగు భాషా సేవ చేసినందుకు ఇంతటి ఘనసత్కారం లభించడం సంతోషంగా ఉందని సుబ్రహ్మణ్య కవి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.